# బాన్సువాడలో అభివృద్ధికే పట్టం



- సెంటిమెంట్‌కు బ్రేక్
- అన్ని మండలాల్లో భారీ మెజారిటీ
- సుధీర్ఘ రాజకీయ అనుభవం ఆయన సొంతం
- ప్రజా సమస్యల పరిష్కారంపైనే ధ్యాస
- చరిత్ర తిరగరాసిన పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, డిసెంబర్ 4 : బాన్సువాడ నియోజక వర్గం అన్ని నియోజకవర్గాలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది, నియోజక వర్గంలో గిరిజనులు, మైనార్టీలు, కమ్మ సామాజిక వర్గం, బీసీలు, ఆర్యవైశ్యులు. లింగాయతులు, రెడ్డి, బీసీ, గొల్లకుర్మ, ముదిరాజ్, పద్మశాలి, మున్నూరు కాపు, బలిజ తదితర అన్ని వర్గాల ప్రజలు ఉంటారు. ఇందులో ఎన్నికల సమయంలో కీలకంగా వ్యవహరించే సామాజిక వర్గాలతో బాన్సువాడ నియోజకవర్గంలో బరిలో నిలిచే వారి భవితవ్యం తేలుతుంది. కాగా అన్ని సామాజిక వర్గాల వారు పోచారం శ్రీనివాస రెడ్డి చేసిన అభివృద్ధికే పట్టం కట్టారు.

**సుదీర్ఘ రాజకీయ అనుభవం..**

45 ఏండ్లుగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న రాజకీయ కురువృద్ధుడు పోచారం 1994 నుంచి తన స్వీయ శక్తితో ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వస్తున్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. 45 ఏండ్లుగా ప్రజలకు విశ్వాస పాత్రుడైన పోచారం 8 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. సమైక్య రాష్ట్రంలో గృహ నిర్మాణ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, గనులు భూగర్భ శాఖ మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన ఈ ప్రాంత ప్రజలు, యువత అభిప్రాయం మేరకు ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా వదిలిపెట్టారు. అనంతరం తెలంగాణ ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు, టీఆర్ఎస్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా సింగూర్ జలాల కోసం ఉద్యమించారు. అనంతరం 2011లో టీఆర్ఎస్ పార్టీ తరపున ఉప ఎన్నికల్లో భారీ విజయం సాధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొదటి వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేసి కేసీఆర్ సారథ్యంలో వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారు. రైతుబంధు పథకం రూపొందించడంలో తనదైన పాత్ర పోషించి, కేసీఆర్ చేత లక్ష్మీపుత్రుడిగా పేరుతెచ్చుకున్నారు. 2018 ఎన్నికల్లో బాన్సువాడ నియోజక వర్గం ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభ స్పీకర్‌గా పని చేశారు. ఆది నుంచి పోచారం పేదలు, రైతుల పక్షపాతిగా నియోజక వర్గ ప్రజల గుండెల్లో నిలిచారు. ఈ సారి ఎన్నికల్లో కూడా పోటీ చేసిన పోచారం శ్రీనివాసరెడ్డిని ప్రజలు మరో సారి ఆశీర్వదించారు. బాన్సువాడ నియోజక వర్గంలో చేసిన అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టారు. 2018లో 18 వేలకుపై చిలుకు మెజారిటీ వచ్చింది. ఈ సారి స్పీకర్ హోదాలో పోటీ చేసిన పోచారం ఆ మెజారిటీని దాటిపోయారు. 23,464 ఓట్ల మెజారిటీ పొంది చరిత్ర సృష్టించారు.

**స్పీకర్ గా పని చేసి గెలిచిన మొదటి నాయకుడు పోచారం**

సమైక్య రాష్ట్రంలో జరిగిన అ సెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా పని చేసిన వారు ఎవరూ గెలువలేదని చరిత్ర చెబుతున్నది. స్వరాష్ట్రంలో ఈ సారి బాన్సువాడ నుంచి స్పీకర్ హోదాలో పోటీ చేసిన పోచారం ఆ అపోహను పటాపంచలు చేశారు. ప్రజాస్వామ్యంలో నిజాయితీ గల నాయకులు ఉండాలని, ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించే నాయకుడిగా పోచారం స్పీకర్ హోదాలో గెలిచి చరిత్ర కెక్కారు.

**అన్ని మండలాల్లోనూ ఆధిక్యతే..**

బాన్సువాడ నియోజక వర్గంలో 1,95,101 ఓట్లు ఉండగా ఇందులో 1,58,663 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డికి నియోజకవర్గంలోని బాన్సువాడ, కోటగిరి, పొతంగల్, రుద్రూర్ , వర్ని, కోటగిరి, చందూర్, మోస్రా, నస్రుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ ఇలా అన్ని మండలాల్లో అన్ని రౌండ్లలో లీడింగ్ రావడం విశే షం. ఇదంతా పోచారం నిజాయితీ, నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించడంతోనే సాధ్యమైందని ప్రజలు చెబుతున్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

- బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్
- ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న ఈగ సంజీవ్‌రెడ్డి

మెండోరా, డిసెంబర్ 4 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. క్రీడలతో చదువుతో పాటు ఉద్యోగావకాశాలకు అవకాశముంటుందన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. హైదరాబాద్, జనగామ, సిరిసిల్ల, నల్గొండ, కరీంనగర్ జిల్లాల కబడ్డీ మ్యాచులను ప్రారంభించారు. పోటీల నిర్వాహకులు ఏలేటి శ్రీనివాస్, సంతోష్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి, కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, బొబ్బిలి నర్సయ్య, డాక్టర్ గౌతమి, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, సర్పంచ్ గోపిడి గంగారెడ్డి, ఎంపీటీసీ సాయన్న, ఆర్గనైజర్లు గంగాధర్, రాజ్‌కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజేందర్‌రెడ్డి

# ప్రశాంత్ రెడ్డికి ప్రజల హ్యాట్రిక్ కానుక

- ఉద్యమం నుంచి అపూర్వ అభివృద్ధి అందించే దాకా..
- ప్రజల కోసం..ప్రజల మధ్య నిలిచిన వేముల

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 4 : ప్రజల కోసం.. ప్రజల మధ్యనే ఉండి పని చేసే నాయకుడికి ప్రజలు పట్టం కట్టారు. ఏ పనైనా అంకిత భావంతో చేస్తే అద్భుత ఆదరణ లభిస్తుందనడానికి నిదర్శనం బాల్కొండ ప్రజలు వేముల ప్రశాంత్ రెడ్డికి అందించిన హ్యాట్రిక్ విజయం. వేముల ప్రశాంత్ రెడ్డి ఎంచుకున్న కర్తవ్యంలో అంకిత భావం కనిపిస్తుంది. మలి దశ తెలంగాణ ఉద్యమంతో మొదలై మంత్రిగా ప్రజలకు అందించిన సేవల్లో కనబర్చిన అంకిత భావానికి ఆయనకు బాల్కొండ నియోజక వర్గ ప్రజలు హ్యాట్రిక్ కానుకను అందజేశారు.

**ఉద్యమకారుడికి పట్టం**

వేముల ప్రశాంత్ రెడ్డి తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి ప్రజా రాజకీయాలను చూస్తూ.. కేసీఆర్ అడుగు జాడల్లో తన తండ్రి నడవడం చూస్తూ ఉద్యమ రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. కేసీఆర్ పిలుపు మేరకు నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ బాధ్యతలు, ఉద్యమ కార్యక్రమాల బాధ్యతలు చూస్తూనే కేసీఆర్ అప్పజెప్పిన పనులను పూర్తి చేసి పెడుతూ కార్యదక్షుడిగా గుర్తింపును పొందారు. దీంతో తొలి సారే 2014లో ప్రజలు ఆయనను జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారు.

**ప్రజలిచ్చిన బాధ్యతకు పట్టం కట్టిన వేముల**

తొలి సారే జిల్లాలోనే అత్యధిక మెజార్టీ అందించడాన్ని వేముల ప్రశాంత్ రెడ్డి బాధ్యతగా భావించి కేసీఆర్ వద్ద తనకు ఉన్న ప్రత్యేక ప్రేమ, విశ్వసనీయతను బాల్కొండ నియోజక వర్గ అభివృద్ధికి వినియోగించారు. అటు కేసీఆర్ సైతం ప్రశాంత్ రెడ్డికి కీలక బాధ్యతలను అప్పగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో తన మానస పుత్రిక మిషన్ భగీరథకు వైస్ చైర్మన్‌ను చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమాలోచనల సమయంలో ఎస్సారెస్పీకి కేసీఆర్ పునర్జీవం పథకాన్ని అందించారు. దానిని ప్రత్యేక కృషితో, మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌గా, మంత్రిగా పూర్తి చేయించారు ప్రశాంత్ రెడ్డి. ఎస్సారెస్పీ నాన్ కమాండ్ ఏరియాలో బోరు బావులే శరణ్యమని అసెంబ్లీలో గళం వినిపించి కేసీఆర్‌ను మెప్పించి ఒకే రోజు 10 విద్యుత్ సబ్ స్టేషన్లు సాధించారు. మొత్తం 18 కొత్త సబ్ స్టేషన్లు నిర్మించి చరిత్ర సృష్టించారు. కొత్త ఎత్తిపోతల పథకాలు తెచ్చి, లక్ష్మీ ఎత్తిపోతల పథకం పూర్తి చేయించి, పాత ఎత్తిపోతలను బాగు చేయించారు.పునర్జీవం పథకం ద్వారా వరద కాలువ, కాకతీయ కాలువలు ఏడాదంతా నీళ్లు ఉండేలా చేసి రైతులకు శాశ్వత ప్రయోజనం అందించారు. భీమ్‌గల్‌ను మున్సిపాలిటీగా మార్చారు. దీంతో 2018లో రెండో సారి సైతం బాల్కొండ ఓటర్లు జిల్లాలో అత్యధిక మెజార్టీతో గెలుపును అందించారు.




**మంత్రిగా మరుపు రాని అభివృద్ధి అందించి..**

రెండో సారి గెలిచాక ఆర్ అండ్ బీ, శాసన సభా వ్యవహారాలు, హౌసింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నియోజక వర్గంలో 50కి మించి కుటుంబాలు లేని తండాలకు సైతం బీటీ రోడ్లు, అన్ని గ్రామాల్లో డబుల్ రోడ్లు, అంతర్గత బీటీ రోడ్లు, మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్, ఫోర్ లైన్ బీటీ రోడ్లు, వాగుల మీద భారీ వంతెనలు నిర్మించారు. కరోనా విపత్తులో ప్రజల వెంటే ఉన్న విలువైన నాయకుడిగా నిలిచారు. కరోనా వేళ ఆక్సిజన్ అందక కన్ను మూసిన బాధాకర దృశ్యాలు చూసి చలించి పోయి తన సతీమణి, మిత్రుల సహకారంతో నియోజక వర్గంలోని అన్ని పీహెచ్‌సీల్లో ఆక్సిజన్ బెడ్లు ఏర్పాటు చేయించి ఇక్కడే ఆక్సిజన్ ఉత్పత్తి, బాటలింగ్ యూనిట్ పెట్టించి ప్రశంసలు అందుకున్నారు. సుమారు వంద వరకు కొత్త దేవాలయాలు,చర్చిలు, మసీదులకు కొత్త వాటి నిర్మాణానికి, మరమ్మతులకు భారీ నిధులు తీసుకురాగలిగారు. ఇలా రెండో పర్యాయంలో అందించిన భారీ అభివృద్ధి, యువతకు పోటీ పరీక్షల ఉచిత శిక్షణ, మెటీరియల్ అందజేత, జాబ్ మేళా, సుమారు 12 వేల మందికి ఉచితంగా డ్రైవింగ్ లైసున్సులు, హెల్మెట్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలతో ప్రజలు మూడో సారి గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించారు.

# 8న జడ్పీ సాధారణ సర్వ సభ్యసమావేశం

కామారెడ్డి, డిసెంబర్ 4 : కామారెడ్డి జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో సాయాగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి జడ్పీ సభ్యు లు, ప్రజా ప్రతినిధులు లేవనెత్తే అంశాలకు సంబంధించి అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ
CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★Requirement: Experienced site engineer for construction site Experienced site supervisor for construction site Contact: 9052865599
NTZ-318491

WANTED
★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.